కథ

**జి.మురళీకృష్ణ**

# పరుగు పందెం

**సాయంకాలం అయిదయింది. చలి కావటం వలన సూర్యుడు అప్పుడే అస్తమిస్తున్నాడు. నారింజ రంగులో నీరెండ లోకాన్ని కప్పివేస్తూంది.**

రోడ్డుకి కుడివైపున ఉన్న 'లిటిల్ సిటిజన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్' అనే బోర్డున్న బిల్డింగ్‌లో గణగణా బెల్లు మ్రోగింది. అయిదు నిమిషాల తర్వాత ఒకే రకం యూనిఫాం ధరించిన పిల్లలందరూ చీమల పుట్టలోనుంచీ చీమలు వచ్చినట్లు వచ్చారు. అసలే రిక్షాలు, ఆటోలు మొదలైన వాటితో రద్దీగా ఉన్న ఆ వీధి, వీరి రాకతో ఇంకా రద్దీగా రణగొణ ధ్వనిగా అయింది.

స్కూల్ బ్యాగ్ భుజాన తగిలించుకుని సైకిల్ చిన్నగా నడుపుకుంటూ స్నేహితులతో మాట్లాడుతూ వస్తున్నాడు గోకుల్.

''నేను చదివిన క్వశ్చన్స్ ఎగ్జామ్స్‌లో వస్తాయో, రావో అని చాలా భయం వేసిందిరా! మొత్తానికి బాగానే రాశాను'' అన్నాడు ఒక కుర్రాడు.

''ఫస్ట్ క్లాస్ వస్తుంది కదా!'' అన్నాడు గోకుల్.

''ఫస్ట్‌క్లాస్ ఎవడికి కావాలి? ఫస్ట్ ర్యాంక్ రావాలి. లేకపోతే మా డాడీ చంపేస్తాడు''

''మా డాడీ కూడా అంతేరా! పోయినసారి ఎగ్జామ్స్ కన్నా ఒక్క ర్యాంక్ తగ్గినా ఊరుకోడు'' అన్నాడు గోకుల్.

''సరే! సాయంత్రం స్టడీ అవర్‌కి వస్తావుగా!''

''వస్తాను. బైరా!'' అని గోకుల్ సైకిలెక్కి బయలుదేరాడు.

గోకుల్ ఇంటికి వచ్చేసరికి ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. సైకిల్ మెట్ల దగ్గర స్టాండు వేసి లోపలికి వచ్చాడు. డాడీ ఆఫీస్ నుంచీ బజారు వెళ్ళి తిరిగి ఇంటికి వచ్చేసరికి రాత్రి తొమ్మిది అవుతుంది.

**''ఒరేయ్! నువ్వు ఆఫీస్ నుంచీ రాగానే క్లబ్బుకు వెళ్ళటం లేదా! కోడలు కూడా డ్యూటీ నుంచీ రాగానే టి.వి. ముందు కూర్చోవటం లేదా! అలాగే చదివి, చదివి అలసిపోయిన ఆ పసివాడికి కాసేపు సరదాగా ఆడుకోవాలని అనిపించదా?'' అన్నాడు కోదండరామయ్య.**

మమ్మీ ఏదో ఒక పనిమీద బయటకు వెళుతుంది.

గోకుల్ ఆలోచిస్తూనే కాళ్ళు, చేతులు, ముఖం కడుక్కుని బట్టలు మార్చుకుని డైనింగ్ టేబుల్ దగ్గర పళ్ళు తినటానికి కూర్చున్నాడు.

ఇంతలో కోదండరామయ్య వచ్చాడు. ''తాతయ్యా! నువ్వు వాకింగ్‌కి వెళ్ళలేదా?'' అడిగాడు.

''ఇప్పుడే వెళ్ళబోతున్నాను'' కోదండరామయ్య యాపిల్ కోసి, ముక్కలు చేసి ప్లేట్‌లో అందించాడు.

తాతయ్య అలా దగ్గరుండి తినిపిస్తూంటే అమ్మ సమయానికి ఇంట్లో లేదన్న ఆశాభంగం నుంచీ కొంచెం ఊరట లభించిందనిపించింది గోకుల్‌కి.

''తాతయ్యా! మళ్ళీ ఆరింటికి స్టడీ అవర్‌కి అటెండ్ అవ్వాలి. ఐదు నిమిషాలు లేట్ అయినా మోకాళ్ళ మీద నుంచో బెడతారు మా మేడం. టాటా!'' బయటకు వెళుతూ అన్నాడు గోకుల్.

'అప్పుడే మళ్ళీ స్కూలా!' అనుకుంటూ టాటా చెప్పాడు కోదండరామయ్య. రాత్రి తొమ్మిదవుతూంది. కోదండరామయ్య గోకుల్ రాక కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు. వాడొస్తేనే తనకు కాస్త సందడి.

గోకుల్ స్టడీ అవర్ నుంచీ వచ్చాడు. స్నానం చేసి తాతయ్య పక్కలో పడుకుంటూ ''తాతయ్యా! నిన్న హరిశ్చంద్రుడి కథ సగం చెప్పావు కదా! మిగిలినది చెప్తావా?'' అని అడిగాడు.

''అలాగే చెపుతాను విను'' కోదండరామయ్య కథ చెప్పసాగాడు.

అయిదు నిమిషాలు కూడా గడవకముందే సుమంతి అక్కడకు వచ్చి ''గోకుల్! ఇక్కడ పడుకున్నావా? హోం వర్కు చేసుకుందువుగాని పద!'' అన్నది.

''అబ్బా! మమ్మీ! ఇప్పుడే కదా వచ్చాను. ఒక పావుగంట ఆగి వస్తాను మమ్మీ'' అన్నాడు.

''అదేం కుదరదు. ఇప్పుడు పావుగంట ఆలస్యంగా పడుకుంటే రేపు పావుగంట ఆలస్యంగా లేస్తావు. మళ్ళీ ఎర్లీ మార్నింగ్ ట్యూషన్‌కి వెళ్ళాలి. అసలే ఈ సంవత్సరం సెవంత్ క్లాస్. పబ్లిక్ ఎగ్జామ్స్ కూడానూ. పద!'' బలవంతంగా లేవదీసి తీసుకువెళ్ళింది.

గోకుల్ గునుస్తూనే వెళ్ళాడు. ''ఏం చదువులో! ఎప్పుడూ చదువే అయితే ఇక పిల్లలు ఆడుకునేదెప్పుడు?'' కోదండరామయ్య నిట్టూర్చాడు.

మనుషులు అటూ ఇటూ నడుస్తున్న అలికిడికి మెలకువ వచ్చింది కోదండరామయ్యకి. గడియారం వంక చూశాడు. అయిదయింది. ఇంకా తెల్లవారలేదు. ఇల్లంతా లైట్లు వేసి ఉన్నాయి. తన గదిలో నుంచీ ఇవతలకు వచ్చాడు.

అప్పటికే గోకుల్ ట్యూషన్‌కి రడీ అవుతున్నాడు. స్వెట్టర్ వేసుకున్నాడు. కాళ్ళకి బూట్లు తొడుక్కున్నాడు. తలకి చలి తగలకుండా మంకీ క్యాప్ పెట్టుకున్నాడు.

''తాతయ్యా! బై! మమ్మీ బై!'' చెప్పి సైకిల్ తీసుకుని వెళ్ళిపోయాడు.

''పసివాడు. అంత చలిలో, చీకటిలో ట్యూషన్‌కి వెళ్ళకపోతే ఏం పోయింది? స్కూల్‌లో చదువుకుంటున్నాడు కదా!'' అన్నాడు.

''మీకు తెలియదులెండి'' ముక్తసరిగా అని లోపలికి వెళ్ళింది సుమంతి.

★ ★ ★

ఆరోజు గోకుల్ తన క్లాస్‌కి వెళ్ళేసరికి ఒక కుర్రాడు దిగాలుగా కూర్చుని ఉన్నాడు. అతని చుట్టూ నలుగురైదుగురు కుర్రాళ్ళు నిలబడి ఉన్నారు. అందరి ముఖాల్లో భయం, బెంగ కన్పిస్తున్నాయి.

''ఏమైందిరా?'' దగ్గరకొస్తూ అడిగాడు గోకుల్.

''ప్రోగ్రెస్ కార్డులు ఇస్తున్నార్రా! సుధీర్‌కి ఫోర్టీంత్ ర్యాంక్ వచ్చింది. క్రిందటిసారికన్నా రెండు ర్యాంకులు వెనక్కి వెళ్ళాడు'' అన్నాడు ఒక కుర్రాడు.

సుధీర్ వంక జాలిగా చూస్తూ గోకుల్ క్లర్క్ దగ్గరకి వెళ్ళి తన ప్రోగ్రెస్ కార్డు తీసుకుని మళ్ళీ



ఫ్రెండ్స్ దగ్గరికి వచ్చాడు.

''ఒరేయ్! నా ర్యాంక్ తగ్గింది. మా డాడీ చంపేస్తాడురా! ఎలారా!'' సుధీర్ భయంగా అంటున్నాడు.

''నేను ఫస్ట్‌ర్యాంక్ తెచ్చుకోవాలని మా డాడీ రెండునెలల నుంచీ చెప్తున్నాడు. ఈసారీ రాలేదు. నాకూ భయంగా ఉందిరా!'' ఇంకోకుర్రాడు అన్నాడు.

''గోకుల్‌కీ ఫస్ట్‌ర్యాంక్ రావాలి. సుధీర్‌కీ ఫస్ట్ ర్యాంక్ రావాలి. రమ్యకీ ఫస్ట్‌ర్యాంక్ రావాలి. అందరికీ ఫస్ట్ ర్యాంక్ ఎలా వస్తుందిరా?'' ఒక కుర్రాడు అన్నాడు.

''ఛీ ఛీ! ఈ ప్రపంచంలో అసలు మమ్మీ, డాడీలు అనేవాళ్ళు లేకపోతే మన ప్రాణాలకు హాయిగా ఉంటుంది!' మరో కుర్రాడు అన్నాడు.

పిల్లలందరూ తాత్కాలికంగా భయం మర్చిపోయి ఫక్కున నవ్వారు.

''తాతయ్యా! రేపు ఆదివారం. పార్కుకు తీసుకువెళ్ళవా?'' ఇంటికి వచ్చిన తర్వాత అడిగాడు గోకుల్. ''అలాగేరా!'' అన్నాడు కోదండరామయ్య.

ఆ మర్నాడు కోదండరామయ్య మనవడిని పార్కుకు తీసుకువెళ్ళాడు. గోకుల్ ఉయ్యాల లూగాడు. జారుడు బండ జారాడు. బోటు షికారు చేశాడు. ఐస్‌క్రీం తింటానన్నాడు. చిప్స్ కావాలన్నాడు. కూల్‌డ్రింక్ తాగుతానన్నాడు. కోదండరామయ్య మనవడు అడిగినవన్నీ కొనిచ్చాడు.

ఇద్దరూ ఇంటికి వచ్చేసరికి తొమ్మిది అయింది. ''ఎక్కడికి వెళ్ళారు నాన్నా?'' అడి

గాడు కిరీటి.

''ఈరోజు ఆదివారం కదురా! పార్కుకు తీసుకువెళ్ళాను.''

''ఏమిటి నాన్నా ఇది! మొన్న సినిమాకి తీసుకువెళ్ళారు. ఈరోజు పార్కుకి తీసుకువెళ్ళారు. ఇలా తిరగటం అలవాటు చేస్తే వాడు ఎందుకైనా పనికివస్తాడా? నాకులాగా వాడిని ఇంజనీరుని చేయించాలని నా కోరిక.''

''ఒరేయ్! నువ్వు ఆఫీస్ నుంచీ రాగానే క్లబ్బుకు వెళ్ళటం లేదా! కోడలు కూడా డ్యూటీ నుంచీ రాగానే టి.వి. ముందు కూర్చోవటం లేదా! అలాగే చదివి, చదివి అలసిపోయిన ఆ పసివాడికి కాసేపు సరదాగా ఆడుకోవాలని అనిపించదా?'' అన్నాడు కోదండరామయ్య.

''నా కొడుకు భవిష్యత్ చేతులారా మీరే చెడగొడుతున్నారు'' సుమంతి కూడా గొణుక్కుంటూ లోపలికి వెళ్ళిపోయింది.

వారం రోజులు గడిచిపోయాయి. కొడుకూ, కోడలూ ముభావంగా ఉంటున్నారు. కోదండరామయ్యకి బాధగా అన్పించింది.

ఆరోజు గోకుల్ వచ్చి ''తాతయ్యా! ఈరోజు సండే. బస్టాండు దగ్గర జెమినీ సర్కస్ వచ్చింది. మా ఫ్రెండ్స్ అందరూ చూసి వచ్చారు. మమ్మీ, డాడీ నన్ను ఎక్కడకూ తీసుకువెళ్ళరు. నువ్వు తీసుకువెళ్ళవా?'' అని అడిగాడు.

కోదండరామయ్య మనసు రెపరెపలాడింది. ఆరోజు కొడుకూ, కోడలూ నిష్ఠూరంగా అన్న మాటలు, వాళ్ళ ముభావం గుర్తొచ్చింది. అయినా మనవడి కోరిక కాదనలేకపోయాడు. వాడిని గుండెకు హత్తుకుంటూ ''అలాగే! సాయంత్రం వెళదాం'' అన్నాడు.

సాయంత్రం అయింది. కోదండరామయ్య, గోకుల్ కలిసి సర్కస్‌కి వచ్చారు. అమ్మాయిలు గాల్లో ఎగరటం, ఏనుగు పూజ చేయటం, సింహాలు, పులులు, లేళ్ళు మొదలైన జంతువులు, అన్నీ గోకుల్ కళ్ళు పెద్దవి చేసుకుని చూశాడు.

ఇద్దరూ ఇంటికి వచ్చేసరికి కిరీటి, సుమంతి ఇద్దరూ కాలుగాలిన పిల్లుల్లా అటూ ఇటూ తిరుగుతున్నారు. కోదండరామయ్యకి అప్రయత్నంగా జంకుగా అన్పించింది.

''సర్కస్‌కి వెళ్ళారా?'' తీక్షణంగా చూస్తూ అన్నాడు కిరీటి.

''అవునురా! పిల్లాడు సరదా పడుతుంటేనూ..''

''మొన్న స్లిప్‌టెస్ట్‌లో వాడి ర్యాంక్ ఎంతో తెలుసా? టెంత్ ర్యాంక్. మూడు ర్యాంకులు వెనక్కి పోయాడు.''

''మూడు ర్యాంకులు అంటే మూడు మార్కులు తేడా! అంతమాత్రం చేత తెలివితక్కువ వాడేనా?''

''ఇలా వెనకేసుకు వస్తే వాడు ఎందుకూ పనికి రాకుండా పోతాడు. మేం వాడి కన్న తల్లిదండ్రులం. చదువుకున్నవాళ్ళం. మాకన్నా మీకు ఎక్కువ తెలుసా?'' అన్నది సుమంతి.

''చూడమ్మా! నేను మీలాగా పెద్ద చదువులు చదవకపోయినా జీవితం చూశాను. మనస్తత్వాలను అర్థం చేసుకున్నాను. ఈ వయసులో పిల్లలకి ఆడుకోవాలనీ, సరదాగా గడపాలనీ ఉంటుంది. ఎప్పుడూ చదువే అయితే ఇక ఆడుకునేదెప్పుడు? నేనేం వాడి చదువు చెడగొట్టి తీసుకువెళ్ళటం లేదు. ఆదివారం పూట మాత్రమే తీసుకు వెళుతున్నాను'' అన్నాడు కోదండరామయ్య.

''అసలు నా కొడుకుని నాకు చెప్పకుండా ఎందుకు తీసుకువెళ్ళాలండీ! ఏమండీ.. మీనాన్నగారి చేతుల్లో పెరిగితే మన బాబు భ్రష్టుడైపోతాడు. వెంటనే ఆయన్ని ఏ ఆశ్రమంలోనో చేర్పించండి'' అన్నది సుమంతి.

''మమ్మీ! తాతయ్యదేం తప్పులేదు. సర్కస్‌కి తీసుకువెళ్ళమని నేనే అడిగాను'' అన్నాడు గోకుల్.

''నోర్ముయ్ వెధవా!'' సుమంతి గోకుల్ వీపు మీద ఒక్కటి చరిచింది.

''ఈరోజునుంచీ ఎక్కడికీ కదలటానికి వీల్లేదు. టి.వి. బంద్. ఈ గదిలోనే ఉండి చదువుకో!'' బరబరా ఈడ్చుకెళుతూ అన్నది.

★ ★ ★

పదిరోజులు గడిచింది. ఆరోజు-

కిరీటి డ్రైవ్ చేస్తున్న స్కూటర్ ఇంటిముందు ఆగింది. కిరీటి, సుమంతి బజారు వెళ్ళి ఇంటికి వచ్చారు. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది.

''రాజమ్మా! బాబు ఏడీ! అన్నం తిన్నాడా!'' లోపలికి వస్తూ అడిగింది.

''లేదమ్మా! భోజనానికి రమ్మంటే ఆకలి లేదని ఆ తలుపు వేసుకుని కూర్చున్నాడు'' గోకుల్ స్టడీ రూం వంక చూపిస్తూ అన్నది పనిమనిషి.

''గోకుల్!'' పిలుస్తూ దగ్గరకు వేసిన తలుపు నెట్టి చూసిన సుమంతి కెవ్వుమంది. కిరీటి పరుగున వచ్చాడు. గోకుల్ బెడ్‌షీట్ ఫ్యానుకు ఉరి వేసుకుని వేలాడుతున్నాడు. ''బాబూ!'' సుమంతి గాల్లో వేల్లాడుతున్న కాళ్ళను పట్టుకుని బావురుమంది. కిరీటి గభాలున మెడకు చుట్టిన గుడ్డ ఊడదీసి గోకుల్‌ని మంచం మీద పడుకోబెట్టాడు. అతని శరీరం మృత్యువు స్పర్శలా అతి శీతలంగా ఉంది. కిరీటి వళ్ళు జలదరించింది.

సుమంతి తల మంచంకేసి బాదుకుంటూ ఏడుస్తోంది. చుట్టూ గోడల మీద గోకుల్ స్కెచ్ పెన్‌తో పెద్ద పెద్ద అక్షరాలతో రాశాడు. కిరీటి కళ్ళు ఆ అక్షరాల వెంట పరుగులు తీశాయి.

''డాడీ! నీకు చిన్నప్పుడు ఆటల పోటీల్లో కప్పులు వచ్చాయని ఇప్పటికీ గర్వంగా చూపిస్తావే, నేను ఆడుకోవటం ఎప్పుడైనా చూశావా?

మమ్మీ! నీకూ డాడీకి నన్ను ఇంజనీర్‌ను చెయ్యటం ఇష్టమని చెప్పారు. మరి నా ఇష్టమేమిటో ఎప్పుడైనా అడిగారా?

డాడీ! మా స్కూల్ ఎదురుగా రోజూ గుర్రపు బండ్లు వెళుతూ ఉంటాయి. గుర్రం పరుగెత్తుతున్నా దాని యజమాని కొరడాతో ఛెళ్ళు ఛెళ్ళున బాది పరుగులు తీయిస్తూంటాడు. నా చదువు కూడా ఆ గుర్రపు పరుగులాగానే ఉంది. ట్యూషన్లు, స్టడీ అవర్లు, హోంవర్కులు, స్పెషల్ క్లాసులు.. ప్రతిరోజూ ఇదే కార్యక్రమం. పోనీ ఈ ఒక్క సంవత్సరమే అయితే చెయ్యవచ్చు. సెవంత్ తర్వాత ఎయిత్, నైన్త్, టెంత్, ఇంటర్మీడియట్.. ఇంజనీరింగ్.. ఈ పరుగులు నేను పరుగెత్తలేను డాడీ! నేను గుర్రాన్ని కాదు.

నా మనసు అర్థం చేసుకుని సంతోషపెట్టాలని చూసింది తాతయ్య ఒక్కడే! తాతయ్యను ఇంట్లో నుంచీ పంపించివేశారు. టి.వి. కనెక్షన్ కట్ చేశారు. క్రికెట్ బ్యాట్, బంతి స్టోర్‌రూంలో పడేశారు. ఈ కర్ఫ్యూ వాతావరణంలో నేను బ్రతకలేను. నాకు స్వేచ్ఛ కావాలి. కానీ నేను బ్రతికి ఉండగా పరుగుపందెం తప్పదు. అందుకే చచ్చిపోతున్నాను.''

అప్పటికే కబురందుకున్న కోదండరామయ్య ఆగంతకుడిలా అడుగు పెట్టాడు. కిరీటి పరుగున వచ్చి తండ్రి కాళ్ళమీద పడ్డాడు.

''నాన్నా! నువ్వు ఎంత చెప్పినా నేను వినిపించుకోలేదు. చేతులారా నా బిడ్డను నేనే పోగొట్టుకున్నాను. అటు చూడండి నాన్నా! గోకుల్ ఏమని వ్రాశాడో! మీరు చెప్పింది అక్షరాల నిజం'' కిరీటి కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ అన్నాడు.

''మమ్మల్ని క్షమించండి మామయ్యా!'' సుమంతి ఏడుస్తూ అన్నది.

కోదండరామయ్య కాళ్ళ దగ్గర ఒకవైపు కిరీటి, ఒకవైపు సుమంతి కూలబడి దుఃఖిస్తున్నారు.

కోదండరామయ్య గోకుల్ వంకే నిస్తేజంగా చూస్తున్నాడు. అయిపోయింది. ఏదైతే జరుగుతుందని ఇన్నాళ్ళనుంచీ భయపడుతున్నాడో అది జరగనే జరిగింది.

ఆయన ముఖంలో ఆత్మీయులందరినీ పోగొట్టుకుని స్మశానంలో ఒంటరిగా మిగిలిపోయిన మనిషి విషాదం కన్పిస్తూ వుంది. కోదండరామయ్య అలాగే గోకుల్ వంక చూస్తూ కూర్చుండిపోయాడు.